# రాజు కళ్యాణ వైభోగమే

**-వసంతకుమార్ సూరిశెట్టి**

సమయం సాయంకాలం ఆరుగంటలు కావస్తోంది. సముద్రం మీద నుంచి వచ్చే చల్లని గాలికి మనుషులు సేద తీర్చుకుంటున్న తరుణం. వైజాగ్‌లోని ఆర్కే బీచ్‌ని ఆనుకుని వున్న గాయత్రి అపార్ట్‌మెంట్స్‌కి చెందిన ఓనర్సు అందరూ మేడపైకి చేరారు.

గాయత్రి అపార్ట్‌మెంట్స్ తాలూకు అసోసియేషన్ ప్రెసిడెంట్ సంజీవరాయశర్మ అందర్నీ ఉద్దేశించి ఏదో చెప్పి కూర్చున్నాడు. ఆ తరువాత మెంబర్లందరూ ఒక్కొక్కరూ వచ్చి తమకి తోచిన చందా ఇచ్చి వాళ్ల వాళ్ల సీట్లలోకి వెళ్లి కూర్చున్నారు.

అందరూ ఇచ్చిన తరువాత వసూలైన మొత్తాన్ని లెక్కబెట్టారు. మొత్తం ఆరువేల ఐదువందల రూపాయలు వసూలైంది. ఇంత మొత్తం వసూలవడం ఆ అపార్ట్‌మెంట్ చరిత్రలోనే మొదటిసారి కావడం అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసింది.

"అయినా రాజు మనకి చేసిన, చేస్తున్న సహాయానికి ఇది చాలా తక్కువ. అందుకని నా వంతుగా మరో ఐదువందలు చందాగా ఇస్తున్నాను" అని గ్రౌండ్ ఫ్లోర్‌లోని వెంకట్రామయ్య చెప్పడమే కాకుండా తిన్నగా వెళ్లి డబ్బుల్ని ప్రెసిడెంట్ చేతిలో పెట్టాడు. అప్పటివరకూ ప్రశాంతంగా వున్న వాతావరణం వెంకట్రామయ్య చర్యతో ఒక్కసారిగా మారిపోయింది.

ఆఫ్ట్రల్ వెంకట్రామయ్య ఒక బ్యాంకు గుమస్తా. తనే అంత చందా ఇచ్చినప్పుడు నేనొక బ్యాంక్ మేనేజర్‌ని అయి ఉండి అతని కన్నా ఎక్కువ ఇస్తేనే గొప్పగా వుంటుందనుకున్నాడు సెకండ్ ఫ్లోర్‌లో వుంటున్న బ్యాంక్ మేనేజర్ భరద్వాజ. అనుకున్నదే తడవుగా తిన్నగా వెళ్లి ప్రెసిడెంట్‌కి వెయ్యి రూపాయలు ఇచ్చి కూర్చున్నాడు.

"రాజు పెళ్లికి మేము సపరేటుగా ఏదైనా చెయ్యాలనుకుంటున్నాము. అప్పుడుగానీ మీకు తెలీదు ఈ లాయర్ రాజ్యలక్ష్మి గొప్పతనం" అంటూ భయంకరంగా పళ్లికిలిస్తూ చెప్పింది రెండో ఫ్లోర్‌లోవున్న లాయర్ రాజ్యలక్ష్మి.

ఇలా ఎవరికి వాళ్ళు విడివిడిగా వాళ్లకి పేరు వచ్చేట్టుగా రాజు దృష్టిలో పడాలన్నట్లుగా బహుమతులు ఇచ్చుకుంటూ పోతే మనకి చాలా అవమానమై పోతుంది. మనం కూడా విధిగా ఏదైనా చేయాలి అన్న నిర్ణయానికి వచ్చేశారు అపార్ట్‌మెంట్ ఓనర్సు ఎవరికి వాళ్లు.

మొత్తానికి ఎలాగైతేనేం ఆర్కే బీచ్ రోడ్డులో వున్న గాయత్రి అపార్ట్‌మెంట్స్ ఓనర్లంతా మొత్తంగా రాజు పెళ్లికి చందా ఇచ్చినా, రాజుకి ఎంత చేసినా రుణం తీరదన్నట్లుగా ఫీలవసాగారు. అందుకని విడిగా కూడా ఏదో ఒకటి చేయాలన్న నిర్ణయానికి వచ్చేసారు. ఆ రోజు రాత్రి అన్ని ఫ్లాట్స్‌లోనూ ఈ విషయమే చర్చకి వచ్చింది.

రెండో ఫ్లోర్‌లో వున్న విక్టోరియా "ఏమండీ! రాజుకి మనం ఒక ఉంగరం కొనిస్తే ఎలా వుంటుందంటారు?" అని మొగుడ్ని అడిగింది.

"ఐ హావ్ నో అబ్జెక్షన్" అన్నాడు విక్టోరియా మొగుడు ఎడ్వర్డ్ టీవీలో న్యూస్ చూస్తూ.

"ఈయన ఎక్కడ దొరికాడో నా బతుక్కి. క్విజ్ పోటీల్లో కోట్లు గెలుచుకొచ్చేవాడిలా జనరల్ నాలెడ్జి పెంచుకోవాలంటూ టీవీ ముందే తగలబడతాడు" అంటూ కిటికీ తలుపులు మూయడానికి వెళ్లిన విక్టోరియా పక్కఫ్లాట్‌లోని రాజ్యలక్ష్మి రామారావుల మాటలు వినబడుతుంటే గోడకి చెవి ఆనించి వినసాగింది.

"ఏవండీ! రాజు పెళ్లికి అందరూ కలసి పెద్ద గిఫ్ట్ ఇవ్వాలనుకున్నాం కదండీ. ఇప్పుడు అదొక్కటే కాకుండా ఎవరికి వాళ్ళు విడిగా కూడా రాజుకి బహుమతులు ఇవ్వాలనుకుంటున్నారండీ. మనం కూడా ఏదో ఒకటి ఇవ్వాలి మరి. మీరేమంటారు?" అంటూ అడిగింది లాయర్ రాజ్యలక్ష్మి భర్త రామారావుని.

"ఇంతకుముందే కదా అసోసియేషన్ వాళ్లు రాజు పెళ్లి కోసం చందా అడిగితే ఐదు వందలిచ్చావు. మళ్లీ ఇప్పుడు ఎంత ఇద్దామనుకుంటున్నావు?" కొంచెం గాబరాగా అడిగాడు స్వతహాగా పిసినారి అయిన రామారావు.

"ఒక పది తులాల్లో మంచి వెండి గ్లాసొకటి కొనిస్తే ఎలాగుంటుందంటారు?"

"ఏమిటీ? పది తులాల్లో వెండిగ్లాసా? ఎంతవుతుందో తెలుసా నీకు?"

"చాల్లెండి సంబరం. రాజు ఎవరనుకుంటున్నారు? మనమిచ్చే పదితులాల వెండి గ్లాసు రాజుకి ఓ లెక్క కాదు."

రామారావు చేసేదేమీలేక 'సరే'నంటూ తల వూపాడు.

★★★

మర్నాడు రామారావు దంపతులు సిల్వర్ షాపుకి వెళ్లారు గ్లాసు కొందామని. షాపు లోపలికి వెళ్లేసరికి రామారావుకి కళ్ళు తిరిగినంత పనైంది. గాయత్రి అపార్ట్‌మెంట్స్‌లో వున్న ఫ్లాటు ఓనర్స్‌లో సగంమంది ఆ షాపులోనే వున్నారు. ఆ షాపు ఓనరు మాత్రం ఆ రోజు వచ్చేటప్పుడు ఖచ్చితంగా నక్క తోక తొక్కే వచ్చుంటాడు.

"మా మామయ్య కూతురికి పెళ్లి నిశ్చయమైంది. దానికోసం వెండి ప్లేటు కొందామని..." అంది ఒంపులు తిరిగిపోతూ మూడో అంతస్థులోని పంకజం, రాజ్యలక్ష్మిని చూడగానే.

"అబద్ధం ఒట్టి అబద్ధం. వెండి ప్లేటు రాజు కోసం కొంటున్నానంటే నేనేమయినా ఏడుస్తానా? లేకపోతే దానికన్నా పెద్ద వస్తువు కొని రాజు దగ్గర పేరు తెచ్చేసుకుంటానేమోనన్న ఏడుపు దానికి?" భర్త చెవిలో మెల్లగా అంది రాజ్యలక్ష్మి.

ఇలా ఒకరికొకరు, ఒకర్ని మించి మరొకరు ఒకే ఒక వ్యక్తికోసం ప్రేమని వ్యక్తీకరించడం బహుశా ఈ శతాబ్దంలో ప్రపంచ వింతల్లో ఒకటై వుంటుందేమో!

ఆఖరికి ఎలాగైతేనేం రాజు పెళ్లి రోజు రానే వచ్చింది. గాయత్రి అపార్ట్‌మెంట్స్‌లోని వాళ్లందరూ కళ్యాణ మండపానికి వెళ్లేసరికి హాలంతా జనంతో కిక్కిరిసి పోయింది. ఇంతమంది వస్తారని ఎదురుచూడని రాజు చిన్న కళ్యాణ సత్రం బుక్ చెయ్యడం తప్పయిపోయిందన్న సంగతి లేటుగా తెలుసుకున్నాడు. తన పెళ్లికి ఇంతమంది వచ్చారన్న మాట అటుంచితే వచ్చిన వాళ్లందరూ బంగారు, వెండి వస్తువుల్ని బహుమతులుగా ఇస్తుంటే ఊపిరి పీల్చుకోవడం కూడా మరచిపోయి బొమ్మలా ఉండిపోయాడు రాజు.

గాయత్రి అపార్ట్‌మెంట్స్ ఓనర్లందరూ మరచిపోకుండా తమతో తెచ్చిన బహుమతుల్ని రాజుకిచ్చి ఫోటోలు కూడా తీసుకున్నారు.

మధ్యమధ్యలో రాజు "ఎందుకండీ ఇవన్నీ?" అని అంటుంటే-

"భలేవాడివేనోయ్. నీకు చెయ్యకపోతే ఇంకెవరికి చేస్తాం చెప్పు. నువ్వు మాకు అంత కావాల్సిన వాడివి తెలుసా?"

"చాలా సంతోషమండీ. అందరూ ఉండి

భోజనం చేసి వెళ్లాలి సుమా!''

"అరె! నువ్వు ప్రత్యేకంగా చెప్పాలా? ఇది మా ఇంటి పెళ్లి. శుభ్రంగా భోజనం చేసి మరి వెళ్తాం. నువ్వేమీ కంగారుపడకు. అవునూ పెళ్లికి ఎన్నిరోజులు లీవు పెట్టావేమిటి?'' అన్నారు కోరస్‌గా ఫ్లాటు ఓనర్సంతా.

"ఇవాళా, రేపు. రెండురోజులేనండీ.''

"సర్లే. పదిరోజులు లీవు ఇస్తే మాత్రం నువ్వు తీసుకుంటావా? ఎప్పుడు చూసినా డ్యూటీ...డ్యూటీ అంటూ తెగ ఇదై పోతుంటావ్? నీలాంటివాడు ఇంటికొక్కడున్నా చాలు మన రాష్ట్రం స్వర్ణాంధ్ర ప్రదేశ్ అయిపోతుంది'' అంటూ రాజుని మునగ చెట్టు ఎక్కించేసాడు గ్రౌండ్ ఫ్లోర్‌లో వున్న వెంకట్రామయ్య. అంతే... రాజు ముసిముసి నవ్వులు నవ్వుతూ కొత్త పెళ్లాంతోపాటు దభేలుమని వెంకట్రామయ్య కాళ్లకి నమస్కరించాడు.

"ముందే అనుకున్నాను. ఇలాంటిదేదో జరుగుతుందని. వెంకట్రామయ్య రాజుని బుట్టలో వేసేసుకున్నాడు'' అంటూ ఏదో కొంప మునిగిపోయినట్లుగా గొణుక్కున్నాడు ఎడ్వర్డ్.

"వెంకట్రామయ్య భలే కిలాడీలే. వాచ్‌మెన్ నుంచి ఎమ్మార్వో వరకూ అందరూ అతను చెప్పినట్లు వినేవాళ్లే. ఏం మంత్రం వేస్తాడో ఏమో?'' ఇంకొకరు గొంతు కలిపారు ఆ గుంపులోనుంచి.

"సరే సరే. ఎందుకిలా అందరూ తలోక మాటంటున్నారు. వెంకట్రామయ్య కూడా మన గాయత్రి అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాటు ఓనరే కదా. పెద్దాయన కాబట్టి ఆయన కాళ్లకి నమస్కరించాడు రాజు. ఆయన కాళ్లకి నమస్కరిస్తే మనందరి కాళ్లకీ నమస్కరించినట్టే. ఇకపై ఎలాంటి ప్రాబ్లం వచ్చినా ఆయనే చూసుకుంటారు. ఇక పదండి పోదాం'' అంటూ అందర్నీ సమాధానపరచి బయలుదేరదీసాడు అసోసియేషన్ ప్రెసిడెంట్ సంజీవరాయశర్మ.

★★★

పెళ్లి అయిన మూడోరోజు 'బాం...బాం...' అంటూ హారన్ శబ్దం వినిపించగానే గాయత్రీ అపార్ట్‌మెంట్స్‌లో వున్న చిన్నా పెద్దా అందరూ చేతుల్లో బిందెలు, చిన్న చిన్న బక్కెట్లు వుంచుకుని గేటు దగ్గరకి పరుగెత్తసాగారు. గేటు ముందు విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ వారి నీళ్ల లారీ నిలబడి వుంది. దాని పైపుల దగ్గర కొత్త పెళ్లికొడుకు రాజు నిలబడి ఉన్నాడు.

విశాఖలో వున్న నీళ్ల కరువుకి దాహంతో గొంతెండి పోతున్న అపార్ట్‌మెంటు జనాలకి రాజు దైవం. చుట్టుపక్కల వున్న పల్లెటూర్లకి నీళ్లు సరఫరా చెయ్యమని పంపితే ఆ నీటిని ఇలా అపార్ట్‌మెంట్స్ వాళ్లకి తక్కువ రేటుకి అమ్మేయడం రాజు వంటి వాళ్ల పని. ఇలాంటి వాళ్లకి పైవాళ్ల సహాయ సహకారాలు వున్నాయి.

"క్యూలో రండి... వరసగా నిలబడండి'' అంటూ అందర్నీ వరుసలో నిలబెట్టి పైపులు విప్పాడు చేతివేళ్లకున్న బంగారు ఉంగరాలు తళ తళ మెరుస్తూ వుంటే బిందెల్ని నీటితో నింపసాగాడు రాజు హుషారుగా.

★

